

బహుమతులను అందజేస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

సంస్కృతీ సంప్రదాయాలకు నిలయం రంగవల్లులు

చంపాపేట, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సంస్కృతీ సంప్రదాయాలకు నిలయం.. రంగవల్లులని కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని భగత్‌సింగ్ యువజన సంఘం గ్రౌండ్‌లో శనివారం శ్రీసరస్వతి హైస్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలను కార్పొరేటర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. విద్యార్థులు, మహిళలు వేసిన రంగవల్లులను ఆయన తిలకించారు. విద్యార్థులు హరిదాసుల వేషధారణలో అలరించారు. పోటీల్లో గెలుపొందిన వారికి కార్పొరేటర్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ లెక్కల లలితరెడ్డి, ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు నర్సింహ, వినయ్‌కుమార్, అవినా, అనిత పాల్గొన్నారు.



చైర్‌పర్సన్‌కు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకుడు నర్సింహ, కార్మికులు

ఒకే విడతలో 8గంటల పని కల్పించండి

● మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నకు సీఐటీయూ వినతి

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు ఒకే విడతలో 8గంటల పని కల్పించాలని శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో చైర్‌పర్సన్ పండుగుల జయశ్రీరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు ఏర్పుల నర్సింహ మాట్లాడుతూ మున్సిపాలిటీలో కార్మికులు ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో 8గంటలు పని చేస్తున్నారని తెలిపారు. దీంతో కార్మికులకు ఇబ్బంది కలుగుతుందన్నారు. ఉదయం 5గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు ఒకే విడతలో పని చేసేలా అవకాశం కల్పించాలని కోరారు. సమీప మున్సిపాలిటీల్లో కూడా ఒకే విడతలో కార్మికులు పని చేస్తున్నారని, కేవలం పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలో మాత్రమే ఈ విధంగా పనులు చేస్తున్నారని పేర్కొన్నారు. కార్మికుల సమస్యను దృష్టిలో పెట్టుకుని ఒక పూటలో 8గంటలు పని చేసేలా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శివకుమార్, ముత్యాలు, జవాన్లు మైసయ్య, పోచయ్య, లింగయ్య పాల్గొన్నారు.

శ్రీరమణకాలనీలో సమస్యలు పరిష్కరించాలి

చంపాపేట, జనవరి 11(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని శ్రీరమణ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం కాలనీ అధ్యక్షుడు సూదిని వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్పొరేటర్ సుజాతా నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు కార్పొరేటర్‌ను ఘనంగా సన్మానించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న సీసీ రహదారులతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి, కాలనీ ప్రధాన కార్యదర్శి ఎం.కాంతారెడ్డి, కోశాధికారి సందడి మురళీధర్‌రెడ్డి, కాలనీవాసులు శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

నాణ్యతతో రోడ్డు పనులు చేపట్టాలి : కార్పొరేటర్

వనస్థలిపురం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాలకు ఉపయోగపడేవిధంగా అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ కమలానగర్‌లో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను శనివారం కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులు నాణ్యతా లోపాలు లేకుండా నాణ్యతతో చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో కాలనీవాసులు భాగస్వాములై నాణ్యతతో కూడిన పనులు చేపట్టే విధంగా తగు చొరవ తీసుకోవాలని సూచించారు. కాలనీవాసులు టీవీరావు, సుబ్బారావు, చౌదరి దివాకర్ లింగం పాల్గొన్నారు.

సీఆర్‌ఎంపీ పనుల అంచనాలకు అనుగుణంగా నిధులు మంజూరు చేయండి : పవన్‌కుమార్

కొత్తపేట, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్‌లోని పలు కాలనీల్లో సీఆర్‌ఎంపీ పనులు చేపట్టేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు సమర్పించిన అంచనాలకు అనుగుణంగా నిధులు మంజూరు చేయాలని చీఫ్ ఇంజనీర్ భాస్కర్‌రెడ్డికి కార్పొరేటర్ పవన్‌కుమార్ విన్నవించారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ కార్యాలయంలో చీఫ్ ఇంజనీర్‌ను కలిసి కొత్తపేట డివిజన్‌లో చేపట్టాల్సిన రోడ్డు పనుల్లో జాప్యాన్ని వివరించారు. ఈ పనులకు రూ.20 కోట్ల అంచనాలు రూపొందించిన సరూర్‌నగర్ సర్కిల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ప్రధాన కార్యాలయానికి పంపారని గుర్తుచేశారు. సకాలంలో నిధులు మంజూరు చేసి పనులు చేపడితే, సమస్యలు దూరమవుతాయని ఆయన పేర్కొన్నారు.

ఘనంగా ఉర్సు ఉత్సవాలు

వనస్థలిపురం : కులమతాలకు అతీతంగా ఉర్సు జరుపుకోవడం అభినందనీయమని టీపీసీసీ మీడియా కమ్యూనికేషన్స్ చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సాహెబ్‌నగర్‌లోని హజ్రత్ ఇమాం అలీషా దర్గా ఉర్సు ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలకు టీపీసీసీ మీడియా కమ్యూనికేషన్స్ చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి హాజరై దర్గా వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్కే రియాజ్, అఖిలేష్, వర్ధ, జావేద్, ప్రకాశ్ పాల్గొన్నారు.

14,15 తేదీల్లో వ్యవసాయ మార్కెట్‌కు సెలవు

ఓల్డ్‌మలక్‌పేట, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు ఈనెల 14,15 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించింది. రెండు రోజులు మార్కెట్‌లో ఎలాంటి పంట కొనుగోళ్లు ఉండవని ఎస్‌జీఎస్ దామోదర్ తెలిపారు. రైతులు, వ్యాపారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు. తిరిగి 16తేదీ నుంచి యథావిధిగా కొనుగోళ్లు జరుగుతాయి. ప్రస్తుతం మార్కెట్‌లో మిర్చి సీజన్ కొనసాగుతుంది. రైతులు మిర్చి పంటను పెద్దఎత్తున మార్కెట్‌కు తెస్తున్నారు. ప్రతి రోజు 5వేల క్వింటాళ్ల మిర్చి వస్తుంది. తేజ రకం మిర్చి క్వింటా ధర రూ.14,000 పలుకుతుంది.

చదువులో రాణిస్తూ క్రీడల్లో నైపుణ్యం సాధించాలి

● ఉన్నత విద్యా మండలి కార్యదర్శి శ్రీరామ్ వెంకటేశ్

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్ అన్నారు. శనివారం తుర్కయంజాల్‌లోని ఇండస్ వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్ 8వ వార్షికోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువులో రాణిస్తూ క్రీడల్లోనూ నైపుణ్యం సాధించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఇండస్ వ్యాలీ ఇంటన్నేషనల్ స్కూల్ చైర్మన్ రాఘవరెడ్డి, డైరెక్టర్ సుధీర్, ప్రిన్సిపాల్ ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

కూడారై స్వామికి 108 గంగాళాలతో పాయస నివేదన

కొత్తపేట, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కొత్తపేట స్నేహపురి గోదాసమేత పద్మావతీ వేంకటేశ్వరాలయం, సరూర్‌నగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయం, గడ్డిఅన్నవరంలోని సత్యనారాయణస్వామి ఆలయాలలో శనివారం తెల్లవారుజామున 27వ రోజు తిరుప్పావై కూడారై పాశురం వేళ 108 వెండి, ఇత్తడి గంగాళాలతో పాయస నివేదన ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవంలో పరిసర కాలనీల మహిళలు పాల్గొన్నారు.

మాయదారి మాంజా..

- చైనా దారంతో పక్షులతో పాటు వాహనదారులకు ప్రమాదం
- నిషేధం ఉన్నా పట్టించుకోని వ్యాపారులు
- ఈస్ట్‌జోన్ పరిధిలో పోలీసుల విస్తృత తనిఖీలు

సైదాబాద్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ వచ్చిందంటే చిన్నా పెద్ద తేడా లేకుండా గాలిపటాలను ఎగురవేస్తారు. ఈ క్రమంలో చాలామంది పోటీతత్వంతో ఇతరుల పతంగులను తెంపేయాలని చైనా మాంజా వినియోగిస్తున్నారు. మరి కొందరు తెలియకుండానే మార్కెట్లో దొరికే చైనా మాంజా దారం వినియోగిస్తున్నారు. సైదాబాద్, మలక్‌పేట, మాదన్నపేట, పాతబస్తీ పరిసరాలలో చైనా మాంజా విక్రయాలు గుట్టుచప్పుడు కాకుండా కొనసాగుతున్నాయి. పోలీసులు విస్తృత తనిఖీలు చేపడుతున్నా అమ్మకాలు రహస్యంగా కొనసాగిస్తున్నారు. గాజు పిండి, హానికర రసాయనాలతో తయారు చేసిన ఈ దారంతో పక్షులకు, వాహనదారులకు ప్రమాదం పొంచిఉంది. సింథటిక్ దారంను ఉపయోగిస్తారు. దీన్ని పట్టుకుంటే చేయి తెగేంత పదనుగా ఉంటుంది. తెగిపోయిన మాంజా రోడ్లపై పడడంతో వాహనాలు ప్రమాదాల బారిన పడిన ఘటనలు ఉన్నాయి. చెట్లపై, తీగలపై ఆ దారానికి చిక్కి ఎన్నో పక్షులు ప్రాణాలు విడిచాయి. మరికొన్ని గాయాలపాలయ్యాయి. ఈ నేపథ్యంలో హరిత ట్రిబ్యునల్ చైనా మాంజాను నిషేధించింది. దీంతో మాంజా వాడకాన్ని అన్ని వర్గాలు వ్యతిరేకిస్తున్నాయి.



డీసీపీ ఆధ్వర్యంలో పోలీసుల ప్రత్యేక సమావేశం

చైనా మాంజా అమ్మినా కొన్నా జైలు శిక్షే

మాంజాలతో పొంచి ఉన్న ప్రమాదాన్ని గుర్తించి తెలంగాణ ప్రభుత్వం జనవరి 2016లో వీటి అమ్మకాలను నిషేధించింది. పర్యావరణ పరిరక్షణ చట్టం1986 ప్రకారం చైనా మాంజాను కొనుగోలు చేసినా అమ్మినా నేరంగా పరిగణిస్తారు. దీన్ని ఉల్లంఘించిన వారికి ఐదు సంవత్సరాలు, అంతకున్నా ఎక్కువ జైలుశిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తారు. పక్షులు, జంతువులకు హాని కలిగిస్తే వన్యప్రాణ సంరక్షణ చట్టం ప్రకారం మూడు నుంచి ఏడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తారు.



మార్కెట్లో చైనా మాంజా

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



ప్రభుత్వ నిషేధిత చైనా మాంజా విక్రయించినా, ఎగురవేసినా చట్టపరంగా కేసులు నమోదు చేస్తాం. పతంగులు ఎగురవేసే సమయంలో పక్షులతో పాటు మనుషులకు ప్రమాదం పొంచి ఉంది. హరిత ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు చైనా మాంజా విక్రయాలపై నిఘా పెంచాం. విక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు తనిఖీలు చేపడుతున్నాం. ఈ మేరకు శనివారం జోన్ పరిధిలోని పోలీసు అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించాం. నిబంధనలు ఎవరు ఉల్లంఘించినా చర్యలు తప్పవు. ప్రజలెవరూ చైనా మాంజాను కొనవద్దు. ఎక్కడైనా మాంజాను ఉపయోగిస్తే పోలీసులకు సమాచారమివ్వాలి.

- కాంతిలాల్ పాటిల్ సుభాష్, డీసీపీ, సౌత్ ఈస్ట్ జోన్

బడంగ్‌పేట్‌లో శ్మశానవాటికల అభివృద్ధిపై దృష్టి

● మేయర్ పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని పలు గ్రామాల్లో గల శ్మశానవాటికల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి తెలిపారు. శనివారం ఆమె కమిషనర్ పి.సరస్వతితో కలిసి బాలాపూర్, బడంగ్‌పేట్‌లలోని శ్మశానవాటికలను సందర్శించి అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎవరైనా మరణించినప్పుడు వారి అంతిమ సంస్కారాలు నిర్వహించే శ్మశానవాటికలు అన్ని వసతులతో సౌకర్యవంతగా ఉండాలనే ఉద్దేశంతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు భీమిడి స్వప్నాజంగారెడ్డి, బండారి మనోహర్, పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సంతోషిశ్రీనివాస్‌రెడ్డి, అనితాప్రభాకర్, డీఈఈ జ్యోతీరెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

బాలాపూర్ 18వ డివిజన్‌లోని శ్రీబాలాజీ టౌన్‌షిప్, శుభోదయ కాలనీ, సీపీఎస్‌ఆర్ ఫేజ్-2 కాలనీల్లో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ బండారి మనోహర్‌తో కలిసి మేయర్ పారిజాతానర్సింహారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు అప్పారావు, నరేందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.



శ్మశానవాటికలో పర్యటిస్తున్న మేయర్ పారిజాతారెడ్డి, కార్పొరేటర్లు

కాలనీ సమస్యలు పరిష్కరించండి

సరూర్‌నగర్ : తమ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బడంగ్‌పేట్ కార్పొరేషన్ అల్మాస్‌గూడలోని వినాయకహిల్స్ కాలనీవాసులు మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డిని కోరారు. డివిజన్ కాంగ్రెస్ నాయకుడు ఎదుల్ల ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం కాలనీ అధ్యక్షుడు జి.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సదర్భంగా పారిజాతారెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని కాలనీల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ గౌరవాధ్యక్షుడు వెంకటేశ్ గౌడ్, ఉపాధ్యక్షుడు నర్సింహగౌడ్, కోశాధికారి శ్రీకాంత్, ప్రతినిధులు హరినాథ్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రమేశ్, యాదగిరి, సురేశ్, సంతోష్, నాగమణి, వసుమతి, అరుణ పాల్గొన్నారు.

'మాతృ దేవోభవ'లో జబర్దస్త్ అవినాశ్ సందడి

సరూర్‌నగర్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ నాదర్‌గుల్‌లోని మాతృదేవోభవ అనాథాశ్రమంలో శనివారం జబర్దస్త్, బిగ్‌బాస్ ఫేమ్ ముక్కు అవినాశ్ సందడి చేశారు. ఆశ్రమం నిర్వాహకుడు గట్టు గిరి చేపట్టిన 'సెలెబ్రిటీతో పునర్జన్మ ఛాలెంజ్' అనే కార్యక్రమంలో భాగంగా ఆయన ఆశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అవినాశ్ అక్కడి అభాగ్యులతో సరదాగా గడపారు. ఓ అభాగ్యుడి జుట్టును స్వయంగా కత్తిరించి స్నానం చేయించారు. అనంతరం అన్నదానం నిర్వహించి వారికి భోజనం వడ్డించారు. తన వంతు సాయంగా రూ.పదివేలు నగదు సాయాన్ని ఆశ్రమానికి అందజేశారు. ఆశ్రమ నిర్వాహకులు చేపట్టిన ఛాలెంజ్ కార్యక్రమం బాగుందని, దీని ద్వారా ఎంతో మందికి పునర్జన్మ కల్పించవచ్చునని ఆయన పేర్కొన్నారు.

ఇళ్లలో చోరీ చేస్తున్న దొంగ అరెస్ట్

● రూ.5.92 లక్షల నగలు స్వాధీనం

హైదరాబాద్ సిటీ,/చాదర్‌ఘాట్ జనవరి 11(ఆంధ్రజ్యోతి) : పట్టపగలు ఇళ్లలో చోరీకి పాల్పడుతున్న పాత నేరస్థుడిని సౌత్‌ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వెస్ట్‌బెంగాల్‌కు చెందిన ఆసిఫ్ అలీ ఖాన్(66) బండ్లగూడలో ఉంటూ టీ దుకాణంలో హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. వస్తున్న ఆదాయం సరిపోక పట్టపగలు తాళం వేసిన ఇళ్లలో చోరీలు చేస్తున్నాడు. పలు చోరీలు చేసిన ఇతడిపై పోలీసులు 11 కేసులు నమోదు చేశారు. టీ దుకాణంలో పనిచేస్తూనే ఇటీవలి కాలంలో రెండు తాళం వేసిన ఇళ్లలో చోరీలు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి రెండు చోరీ కేసులకు సంబంధించి రూ.5.92లక్షల విలువైన 75 గ్రాముల బంగారు నగలు, వెండి, వాచీలు, స్వాధీనం చేసుకున్నారు.

జువెనైల్ హోంను సందర్శించిన ఎస్టీ కమిషన్ సభ్యుడు

సైదాబాద్, జనవరి 11(ఆంధ్రజ్యోతి) : సైదాబాద్‌లోని ప్రభుత్వ బాలుర గృహం, ప్రత్యేక బాలుర గృహం(జువెనైల్ హోమ్‌లు)లను శనివారం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్ సందర్శించారు.

ప్రత్యేక గృహంలో వివిధ కేసుల విచారణలో ఉన్న బాలలు, బాలుర గృహంలో ఉన్న వీధి బాలలు, బాలకార్మికులు, అనాథలకు అందుతున్న విద్య, వైద్య సదుపాయాలు, స్వయం ఉపాధి శిక్షణ, భోజన, వసతి సౌకర్యాలను జువెనైల్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ చారువాక్ వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీఎస్ నవీన్, హోం సూపరింటెండెంట్లు అఫ్జల్ సహేలీ, సంఘమేశ్వర్, మైథిలీ ఆఫీస్ సూపరింటెండెంట్లు గోపీకుమార్, జ్వాల తదితరులు పాల్గొన్నారు.

నందిహిల్స్ రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించండి

● కేఎల్లార్‌కు కాలనీవాసుల వినతి



కేఎల్లార్‌కు వినతిపత్రం ఇస్తున్న నందిహిల్స్‌వాసులు

సరూర్‌నగర్ : మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని నందిహిల్స్‌కాలనీలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, వాటి అభివృద్ధికి నిధులు మంజూరు చేయించాలని కాలనీవాసులు కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని కోరారు. ఈ మేరకు శనివారం వారు ఆయనను తుక్కుగూడలోని కాంగ్రెస్ కార్యాలయం లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల మీర్‌పేట్ కార్పొరేషన్‌కు రిజిస్ట్రేషన్ శాఖ నుంచి దాదాపు రూ.20కోట్లు స్టాంప్ డ్యూటీ బకాయిలు విడుదలయ్యాయని, సదరు నిధుల నుంచి తమ కాలనీకి అధి క నిధులు కేటాయింపజేయాలని వారు ఆయనను కోరారు. కేఎల్లార్ మాట్లాడుతూ అధికారులతో చర్చించి నిధులు కేటాయించేలా చూస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు చల్లా సురేందర్‌రెడ్డి, ప్రతినిధులు కృష్ణారెడ్డి, నర్సిరెడ్డి, దామోదర్‌రెడ్డి, పర్వతాలు, మోహనాచారి, శ్రీనివాస్‌రెడ్డి, కాం గ్రెస్ నాయకులు ఎ.సురేందర్‌రెడ్డి, ఎం.సత్యనారాయణ, ఎస్.రాంరెడ్డి, ఐ.శ్రీనివాసు లు, బి.యాదగిరియాదవ్, ఎం.కోటేశ్వర్‌రెడ్డి, సీపీఎం నాయకుడు యాదయ్య పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



మహిపాల్

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. మునగనూర్ మల్లికార్జున్‌నగర్‌కు చెందిన దోమల పల్లి మహిపాల్(32) సపాయి పని చేస్తాడు. ఈనెల 7న ఇంట్లో చెప్పాపెట్టకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ వచ్చింది. చుట్టు పక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం మహిపాల్ తల్లి అండాలు హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి..



నర్సింహ

ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లిన వృద్ధుడు అదృశ్యం అయ్యాడు. హయత్‌నగర్ అయ్యప్పకాలనీకి చెందిన చెరిపల్లి నర్సింహ(85) చేనేత కార్మికుడు. ఈనెల 9న మధ్యాహ్నం ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లాడు. సాయంత్రం అయినా తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువుల, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం నర్సింహ కుమారుడు శ్రీనివాస్ హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రయాణికులతో ఎల్బీనగర్ చౌరస్తా కిటకిట

● వందలాది బస్సులున్నా పడిగాపులు

మన్సూరాబాద్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ అంటే ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఎంతో ముఖ్యమైన పండుగ. సంక్రాంతి పండుగ సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాల్లో వివిధ పనులు, విద్య, ఉద్యోగం, వ్యాపారాలు చేస్తూ స్థిరపడిన వారు వారి వారి సొంతూళ్ల బాట పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం శనివారం నుంచి సంక్రాంతి సెలవులు ప్రకటించడంతో ఎల్బీనగర్ నుంచి విజయవాడకు వెళ్లే వారు పగలు, రాత్రి తేడా లేకుండా బస్సుల కోసం పడిగాపులు కాస్తున్నారు. దీంతో ఎల్బీనగర్‌లోని బస్టాప్ ప్రయాణికులతో కిటకిటలాడుతోంది. రిజర్వేషన్ చేసుకున్న వారు ప్రశాంతంగా ప్రయాణం సాగించగా రిజర్వేషన్ చేసుకోని వారు బస్సుల్లో సీట్ల కోసం కుస్తీ పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఏపీ, తెలంగాణకు చెందిన బస్సులు వందలాదిగా ఉన్నప్పటికీ సీట్లు దొరకని చాలా మంది ప్రయాణికులు నిలబడి వెళ్లడం పలు బస్సుల్లో కనిపించింది. కాగా శుక్రవారం రాత్రి నుంచే ప్రయాణికులు తమ సొం తూళ్ల బాట పట్టారు. దీంతో ఎల్బీనగర్ చౌరస్తా, ముఖ్యంగా బస్టాప్ ప్రాంగణమంతా ఇసుకేస్తే రాలనంత జనంతో కిటకిటలాడుతోంది.



బస్సు రాగానే సీటు దక్కించుకునేందుకు పోటీపడుతున్న ప్రయాణికులు



బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

ధ్యానంతో మానసిక ఆందోళన, చికాకులకు స్వస్తి

● బ్రహ్మకుమారీస్ సెక్రటరీ జనరల్ రాజయోగి బ్రిజ్ మోహన్‌జీ

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ధ్యానంతో మానసిక ఆందోళన, చికాకులకు స్వస్తి పలుకవచ్చునని బ్రహ్మకుమారీస్ హెడ్ క్వార్టర్స్ సెక్రటరీ జనరల్ రాజయోగి బ్రిజ్ మోహన్ జీ అన్నారు. బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో శనివారం నగర శివారు రామోజీఫిల్మ్ సిటీలో ఎంఎస్‌ఎంఈ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు సీనియర్ రాజయోగులు బ్రహ్మకుమారీస్ జేటీ చీఫ్ రాజయోగి బీకే మృత్యుంజయ, బ్రహ్మకుమారీస్ అదనపు చీఫ్ రాజయోగిని బీకే యోగిని, చైర్‌పర్సన్, బిజినెస్ అండ్ ఇండస్ట్రీ వింగ్ బ్రహ్మకుమారీస్ రాజయోగి బీకే సంతోష్ దీదీ, డైరెక్టర్ బ్రహ్మకుమారీస్ రష్యా హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశంలోనే తొలి సారిగా యూనైటెడ్ మైండ్స్ ఫర్ ఏ బ్రైటర్ భారత్ అనే ప్రాజెక్టును ఆవిష్కరించినట్లు తెలిపారు. అనేక పనులు, ఒత్తిడిలతో ప్రశాంతత లేక జీవితంలో విసిగిపోయేవారు చాలా మంది ఉన్నారన్నారు. మనస్సుల్లో ఒత్తిడిని తగ్గించుకునేందుకు అనేక విధాలుగా శ్రమిస్తుంటారని పేర్కొన్నారు. ధ్యానం చేయడంతో వీటన్నింటిని అధిగమించవచ్చని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బ్రహ్మ కుమారీస్ ప్రతినిధులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి ఎంఎస్‌ఎంఈ సదస్సును ప్రారంభిస్తున్న బ్రహ్మకుమారీస్ రాజయోగులు

సందడిగా సంక్రాంతి సంబరాలు

సరూర్‌నగర్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ నాదర్‌గుల్‌లోని స్ఫూర్తి ఇంజనీరింగ్ కాలేజీలో శనివారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి కళాశాల ఆవరణలో ముగ్గులు వేసి, పతంగులు ఎగురవేశారు. కళాశాల కార్యదర్శి ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ సంస్కృతీ సంప్రదాయాలను మరిచిపోవద్దని సూచించారు.

వివేకానంద జయంతి వేడుకలు

స్వామి వివేకానంద జయంతి వేడుకలను శనివారం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలోని వివేకానందుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ గిరిధర్, డాక్టర్ పి.గాయత్రి, పావని తదితరులు పాల్గొన్నారు.

లార్డ్స్ స్కూల్‌లో..

మీర్‌పేట్ కార్పొరేషన్ జిల్లెలగూడలోని లార్డ్స్ హైస్కూల్‌లో శనివారం ఉత్తరాయణ ఉత్సవ్ పేరుతో సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. లార్డ్స్ విద్యా సంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీలత ఉత్సవాలను ప్రారంభించారు. విద్యార్థినులు రంగవల్లులు తీర్చిదిద్దగా, విద్యార్థులు పతంగులు ఎగురవేశారు. ప్రిన్సిపాల్ మరియన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గులతోనే సంక్రాంతికి గుర్తింపు

సైదాబాద్ : సంక్రాంతి సందర్భంగా మహిళలు తమ లోగిళ్లలో వేసే అందమైన ముగ్గులతోనే పండుగకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి అన్నారు. శంకేశ్వర్‌బజార్‌లో కార్పొరేటర్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించగా స్థానిక మహిళలు, యువతులు, చిన్నారులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. గజానంద్‌గౌడ్, చంద్రయ్య, గోల్డ్ శ్రీను, కృష్ణవేణి, కవిత పాల్గొన్నారు.



ముగ్గులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

ముగ్గులు మన సంస్కృతికి ప్రతీకలు

కొత్తపేట : ముగ్గులు మన సంస్కృతికి ప్రతీకలని కార్పొరేటర్ పవన్‌కుమార్ అన్నారు. కొత్తపేటలో శనివారం సాయంత్రం బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కాట విజయగౌడ్ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. 30మంది మహిళలు సందేశాత్మక నినాదాలతో రంగవల్లులను తీర్చిదిద్దారు. విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. డివిజన్ అధ్యక్షులు రాజేష్, శివ, సాయినాథ్‌గౌడ్, రాధిక, వైజయంతి, లావణ్య, సంగీత పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతి గొప్పది

మన్సూరాబాద్ : ఇతర దేశాలతో పోలిస్తే భారతీయ సంస్కృతి చాలా గొప్పదని, ఇందుకు నిదర్శనంగా మన తెలుగు పండుగలే నిలుస్తాయని ఎల్బీనగర్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎ.కృష్ణయ్య, ఆర్కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డిలు పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ శ్రీసాయినగర్‌కాలనీ సౌత్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ముత్యాల ముగ్గుల పోటీ లు నిర్వహించారు. శ్రీసాయినగర్ రోడ్ నంబర్.1లో మునుకుంట్ల రేవంత్‌గౌడ్ సహకారం తో నిర్వహించిన ఈ పోటీల్లో 22 మంది మహిళలు పోటాపోటీగా ముగ్గులు వేయగా గెలుపొందిన మొదటి విజేతకు రూ.5వేలు, రెండో విజేతకు రూ.3వేలు, మూడో విజేతకు రూ.వెయ్యిలను బహుమతిగా అందజేశారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఏసీపీ కృష్ణయ్య, కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డిలను కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు బద్దం భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సీహెచ్ ఉమేష్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో సభ్యులు శాలువాలు కప్పి సన్మానించారు.